
# పురుషోత్తం పొదుపు

ఆర్. ఎస్. హైమవతి




త్రిమూర్తులు మొదట శక్తిహీనులై అవతరించారట. తర్వాత దేవీ అనుగ్రహం వల్ల శక్తిమంతులైనట్లు దేవీ భాగవతం చెతోంది.

అందులో నిజమెంతుందో మనకి తెలియదు గాని, ప్రతి పురుషుడి వెనుక స్త్రీ ఉండి నడిపిస్తోంది అన్న విషయం మాత్రం నిజం. పురుషుడిలోచలనాన్ని, ఉత్సాహాన్ని కలిగించి ముందుకి నడిపేది స్త్రీ. అది ఇటు మంచికైనా కావచ్చు. అటు చెడుకైనా కావచ్చు. ఈ విషయం ఎందరిలోనో రుజువవుతోంది.

పురుషోత్తం పొదుపు ఉద్యమానికి నాంది పలకడానికి ప్రేరణ అతడి భార్య పార్వతేనన్న విషయం ముమ్మాటికీ నిజం.

ఉదయం పూట తీరిగ్గా ఒళ్ళో పేపర్ పెట్టుకుని చేత్తో కాఫీ గ్లాను పట్టుకుని తగుతూ - పూర్తిగా వార్తాప్రపంచంలో మునిగిపోయిన పురుషోత్తముని మేల్కొలిపి ఈ జగత్తులోకి తెచ్చింది. ఒకే ఒక పిలుపు, తదువరి విసిరిన వాగ్బాణం.

"ఏమండీ! మీకే! ఎప్పుడూ ఆ పేపరేనా? ఇంటి సంగతులు పట్టించుకోడం ఏమైనా వుందా?"

"అబ్బబ్బ! ఏ మైందే? ఏమిటి ఇంటి సంగతులు? పక్కింటి పిన్నిగారు పట్టు చీర కొనుక్కుంది. ఇలాంటి వేనా?" అన్నాడు పేపర్ మడుస్తూ పురుషోత్తం.

"అయ్యో! అవన్నీ ఊరి సంగతులు. మీకు బొత్తిగా తెలియకపోతే ఎలాగండీ? అయినా అలాంటి సమాచారం మధ్యాహ్నం సేకరించి సాయంకాలం మీరు ఆఫీసు నించీ వచ్చాక చెప్తాను. ఇప్పుడు మాట్లాడేది ఇంటి విషయం" అంది పార్వతి.

"ఇంటి విషయం - పేపరు చదవడం మానేసి అంతగా చర్చించదగ్గ విషయం ఏమిటో?"

"చెప్పుకోండి చూద్దాం!" అంటూ సవాల్ చేసింది పార్వతి.

"ఏ ముందబ్బా? మన ఏకైక పుత్రికకి పెళ్ళి చేసేశాం. అదీ మొగుడు ప్రస్తుతానికి అమెరికాలో ఉన్నారు. ఇప్పట్లో వచ్చే సూచనలు లేవు. ఇకపోతే ఏకైక సుపుత్రుడు వాసు ఉన్నత విద్యల నిమిత్తం కెనడాలో ఉన్నాడు. వాడు అంతకన్నా ఇప్పట్లో రాడు. ఇకపోతే మా వాళ్ళో, మీ వాళ్ళో ఎవరైనా వస్తే రావాలి. ఏమిటి విషయం? చెప్పు."

"అబ్బబ్బ! మీ ఆలోచనలు ఎప్పుడు చూసినా బంధువులు, రాకపోకలు - డబ్బు ఖర్చు - వీటి మీదేనా? వాటిని మించి పోరా?" అడిగింది పార్వతి.

"వాటిని మించిన ఆలోచనలు ఏమున్నాయో! నువ్వేచెప్పు. నాకు తోచడం లేదు."

"ఇన్నాళ్ళు మనకు పిల్ల చదువులు, తరవాత అమ్మాయి పెళ్ళి, తరవాత అబ్బాయి ఫారిన్ చదువుకి పంపడానికి అలా ఖర్చుల మీద ఖర్చులు వస్తూనే ఉన్నాయి. ఒక్క పట్టు చీర కూడా కొనలేదు. అమ్మాయి పెళ్ళి కూడా నా పెళ్ళి పట్టుచీరలు కట్టుకునే చేయించేశాను. కాబట్టి - ఈ ఉగాదికి ఎలాగైనా ఓ పట్టు చీర కొనాల్సిందే!" హుకుం జారీ చేసింది పార్వతి.

"ఉన్నట్లుండి ఇదెక్కడ గొడవే? ఉగాదికే ఏమిటి? ముహూర్తం? మరో పండగకి చూద్దాంలే!" అన్నాడు పురుషోత్తం.

"అలా కాదండీ! ఉగాదికే కొనాలి. ఎందుకంటే ఉగాది నాడు ఏ పని చేస్తే ఆ పనే సంవత్సరమంతా చేస్తారంట."

"చచ్చాంరా! భగవంతుడా! అయితే సంవత్సరమంతా ఈ పట్టు చీరల గొడవ తప్పదన్న మాట. అయితే చచ్చినా కొన్ను."

"అది కాదండీ! సంవత్సరాది నాడు పట్టుచీర కట్టుకున్నామనుకోండి. సంవత్సరం పొడుగునాపట్టు చీరలే కడతామన్న మాట!"

"ఓహో! అయితే ఆ చీరే సంవత్సరం పొడుగునా కడతావా? నేను కొనందే నీకెలా వస్తాయే?"

"మీరు కొనాలనే ఏముంది? మా పుట్టింటి వాళ్ళు పెట్టచ్చు. వియ్యాల వారు పెట్టవచ్చు" అంది పార్వతి.

'ఆ పెడతారు పెడతారు కూర్చో! ఈ రోజుల్లో ఎవరి బట్టలు వాళ్ళు కొనుక్కోవడమే కష్టంగా ఉంటే మరొకరికి పెట్టుపోతలు కూడానా? అందులో పట్టు చీరలు అంటే మాటలా? కనీసం జరీలేనివే వెయ్యి రూపాయలకి పైన ఉన్నాయి.'' అన్నాడు పురుషోత్తం.

''అదంతా నాకు తెలియదు. ఈ సంవత్సరానికి మీరు నాకు పట్టు చీర కొనాల్సిందే!'' పట్టు పట్టింది పార్వతి.

''చూడు. పండగ ఇంక రెండు నెలలే ఉంది. బాంకు బేలెన్స్‌లన్నీ వెతికితే మొత్తం ఐదు వందలు కూడా లేదు. కొత్త రూల్సు ప్రకారం రెండు వందల ఏభై రూపాయలు బేలెన్స్ లేందే చెక్కుబుక్ ఉంచరు. ఇక మిగిలిన రెండు వందల చిల్లరతోనూ నీకెవడు పట్టు చీర ఇస్తాడు చెప్పు? మనం ఎంత పొదుపు చేసినా ఈ రెండు నెలల్లోనూ వెయ్యి రూపాయలు జేర్చలేము.'' అన్నాడు పురుషోత్తం.

''వీలయినంత వరకూ ఖర్చు తగ్గిద్దాము. తరవాత వంద, రెండు వందలు తగ్గితే ఎవరి దగ్గరైనా అప్పు తీసుకుని తరవాత సర్దేద్దాం'' పార్వతి సలహా.

''అబ్బబ్బ! నాకు అప్పులు చెయ్యడం ఇష్టం లేదని తెలుసుకదా!''

''అప్పు చెయ్యొద్దు లెండి. ఇవాల్టి నించీ పొదుపు ప్రారంభిద్దాం పార్వతి ధైర్యం చెప్పింది.

''నరే ఎలాచేస్తావో చెయ్యి. నేనేం అడగను. డబ్బు మిగల్చగలిగితే పట్టుచీర కొనడానికి నేను రెడీ! నెల సరుకుల్లో సగమే సరుకులు కొంటాను. పాలు సగమే కొంటాను. ఎలా సర్దుతావో సర్దు.'' చెప్పాడు పురుషోత్తం.

''రేపట్నించీ పనిమనిషిని మానిపించేస్తాను.ఏభై రూపాయలు, కాఫీ, అన్నం మిగులుతాయి.'' అంది పార్వతి.

''నరే! బాగానే ఉంది కాని. నువ్వు పడకవేస్తావేమో! చూసుకో!

''ఏం పరవాలేదు. కష్టపడి పనిచేస్తే ఒంటికి వ్యాయామం, డబ్బు పొదుపు కూడాను.''

''అబ్బ! ఎంత మాట? అదే నే నంటే - నన్ను పని మనిషిలా చూస్తున్నారంటూ నా మీద ఎగరడమే కాక, పక్కింటి పిన్నిగారితోను, ఎదురింటి ఇల్లాలి తోనూ చెప్పి చాటింపేస్తావు. వెంటనే మీ మహిళా మండలి అంతా కలిసి మగవాళ్ళు ఆడవాళ్ళని అణగ దొక్కేస్తున్నారంటూ, సమాన హక్కులు కావాలంటూ అరపడాలు, ఊరేగడాలు మొదలెడతారు'' అన్నాడు నవ్వుతూ పురుషోత్తం.

''నా అంతట నాకు బుద్ధి పుడితే చేస్తాను. మీరు చెప్తే నేనెందుకు చేస్తాను?''

''నరే! సరే! చెయ్యి. కాని ఊరంతా నేనేదో నీ చేత చాకిరీ చేయించేసి రాచి రంపాన పెట్టేస్తున్నానని మాత్రం చెప్పకు'' అన్నాడు పురుషోత్తం.

*** *** **

'అబ్బబ్బ! హుష్! అమ్మా! ఏమండీ! ఏమండోయ్! మోటారు పాడయినట్టుందండీ! నీళ్లెక్కడంలేదు టాంకులోకి. నూతులోంచి తోడి బట్టలుతకడం, అంట్లు తోమడం - ఈ పన్లన్నీ నా వల్ల కాదండోయ్! పంపు రిపేర్ చేయిద్దురూ!'' అంది పార్వతి నీరసంగా.

నూరు రూపాయలు ఖర్చుపెట్టి పంపు రిపేర్ చేయించాడు పురుషోత్తం. పొదుపు ఉద్యమానికి ఆ విధంగా ఆదిలోనే హంస పాదు.

ఒక రోజు ఉన్నట్టుండి ఓ శుభోదయాన పురుషోత్తం అన్నకొడుకు, కోడలు ఆటోలో దిగారు. కొత్తగా పెళ్లైన జంట. హనీమూన్ ట్రిప్పు.

ఈ రోజుల్లో ఇదొక పరిపాటయిది. హనీమూన్ ట్రిప్ అనడం, బంధువుల ఇళ్లు చుట్టపెట్టి అక్కడికి దగ్గరగా ఉన్నవేవో కొన్ని ప్రాంతాలు చూసి వెళ్తూండడం. హొటళ్ళలో దిగితే డబ్బు ఖర్చు. అందుకే బంధువుల ఇళ్లల్లో దిగడం. ఈ రోజుల్లో ప్రతీ గవర్నమెంటు ఉద్యోగికీ, కంపెనీ వాళ్ళకీ కూడా ఎల్‌టిసిలు. అంచేత రైలు ఛార్జీలు ఉండవు.

అయితే వీళ్లు దిగిన చోట బంధువులకి మాత్రం ఖర్చు, శ్రమ.

అయ్యో! కొత్త దంపతులు వచ్చారే! అంటూ వారికి పిండివంటలతో భోజనాలు, గది, మంచం, పరుపులు ఏర్పాట్లు, వెళ్ళేటప్పుడు ప్రెజంటేషన్లో, బట్టలో ఏదో ఖర్చు తప్పదు. ముఖ్యంగా సిటీల్లో కాపరాలుండే వారికి ఈ బంధువుల తాకిడి పరిపాటే.

ఈసారి పురుషోత్తం మీద ఈ తప్పనిసరి ఖర్చుపడింది.

కొత్త దంపతులు ఊరు తిరగడానికి వెళ్లినప్పుడు పార్వతి అంది భర్తతో.

''ఏమంటీ! ఈ ఉగాదికి కూడా నాకు పట్టు చీర యోగం ఉన్నట్టులేదు'' అని.

''ఒసి నీ పట్టుచీర బంగారంగానూ! బ్యాంక్‌లో ఉన్న ఆ రెండు వందల చిల్లర కూడా ఖర్చయిపోతోందే!'' అన్నాడు పురుషోత్తం.

''కానీండి. ఏంచేస్తాం? తప్పుతుందా?'' అంది పార్వతి.

కొత్త దంపతులు వెళ్లేసరికీ - పురుషోత్తం పొదుపులో మొదటిదిగా - తగ్గించి తెచ్చిన సరకులు అయిపోయాయి. మళ్లీ నెలాఖరు వరకూ నూనె, నెయ్యి, పప్పులు వగైరా కొనుక్కోక తప్పలేదు.

పనిమనిషిని మానిపించేసి ఆ ఖర్చు పొదుపు చేద్దాం అని చూసిన పార్వతికి - పని మరికాస్త ఎక్కువయ్యేసరికి చేయలేక - మళ్లీ పని మనిషిని పిలిచింది. అయితే అది అవసరం కనిపెట్టి మరికాస్త పెంచమని, అలా పెంచితేనే పనిచేస్తానని పట్టు పట్టేసరికీ ఇక తప్పలేదు.

''ఏమిటండీ? ఖర్చు తగ్గిద్దాం అనుకుంటే మరికాస్త ఎక్కువౌతోంది? పోనీ దీన్ని పొమ్మందాం అంటే - ''

''ఎలా అంటావ్? రేపు మీ అన్న ఒదిన పెద్ద హాస్పిటల్లో చూపించుకుందుకు వస్తున్నారా? ఇక చెకప్‌లు అన్నీ అయి వెళ్లేసరికీ ఎన్నాళ్లు పడుతుందో? అదే ఆపరేషన్ అన్నారంటే ఇక చెప్పక్కర్లేదు. ఆస్పత్రికి కేరియర్లు అందివ్వడం, పత్యం వంటలు మరికాస్త పని. పోతే పోయిందిలే! ఏం చేస్తాం? మనం పొదుపు ఏ ముహూర్తాన చేద్దామనుకున్నామో గాని - ఆరంభంలోనే బెడిసికొట్టింది'' అన్నాడు పురుషోత్తం.

''హూ! ఆ ఎదురింటి ఈశ్వరి ప్రతీ ఉగాదికీ ఓ పట్టు చీర కొనుక్కుంటుంది. అందుకే చీటీలు కట్టో, ఎలాగోలా సంవత్సరానికి నాలుగు పట్టుచీరలు కొనుక్కుంటోంది. నేను ఒక్క పట్టు చీర కొనుక్కుందామన్నా - ఇలా ఖర్చులమీద ఖర్చులు వచ్చి పడుతూనే ఉన్నాయి'' అంది పార్వతి నిరాశగా!

''నీ పట్టు చీర ఒదిలెయ్! మనకీ ఉగాదికి అసలు మామూలు బట్టలు కూడా ఉండవ్! అప్పులు చెయ్యక్కర్లేకుండా బైట పడితే చాలు'' అన్నాడు పురుషోత్తం.

*** *** ***

పార్వతి అన్న వదిన వచ్చారు. ఇద్దరూ హార్ట్ ట్రబుల్ పేషంట్లే. చెకప్‌లు, రిపోర్టులు అన్నీ అయ్యేసరికి వారం పట్టింది. బిపి, మగరు ఎక్కువగా ఉన్నందు వల్ల ఆపరేషన్ చేసినా గ్యారంటీ ఇవ్వలేం అన్నారు డాక్టర్లు.

ఆపరేషను చేయించుకుని ఇప్పుడే చచ్చేకన్నా చేయించుకోకుండా మందులతో కొన్నాళ్లు గడుపుదాంలే అనుకున్నారు వాళ్లు.

''హమ్మయ్య!'' అని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు పురుషోత్తం. తనకి కొంత ఖర్చు, శ్రమ తగ్గినందుకు.

ఇక ఆ దంపతుల్ని రైలెక్కించి వచ్చిన పురుషోత్తంకి వాకిట్లోనే టెలిగ్రాం ఎదురైంది. దాని సారాంశం - పురుషోత్తం తల్లికి సీరియస్ అని. ఆవిడకి ఎనభై ఏళ్లు దాటాయి. వారి స్వగ్రామంలో మరో వ్యవసాయం చేసుకుంటూన్న కొడుకు దగ్గర ఉంటోంది. ఇటీవల జబ్బు పడింది. డాక్టర్లు చెప్పారు. ఇక కొద్ది రోజులే బ్రతుకుతుందని.

పురుషోత్తం పెద్దాస్పత్రిలో చూపిద్దామని చూశాడు. ఆవిడ ససేమిరా రానుగాక రానంది. ఎందుకంటే ఆవిడకి ఆ పల్లె వాతావరణమే గాని, సిటీ వాతావరణం నచ్చదు.

''నేను పన్నెండేళ్లకి ఈ ఇంట్లో అడుగు పెట్టాను. అప్పట్నించీ ఇక్కడ అలవాటుపడ్డాను. మీ నాన్నగారు పోయినప్పటికీ ఈ వాతావరణం, ఊరు, ఊరిలోని మనుషులు నా వాళ్లురా! నా చేత్తో నేను నాటిన కొబ్బరి చెట్టూ, మామిడి చెట్టూ ఎదిగి కాయలు కాస్తున్నాయి. ఈ పెరట్లో ప్రతి చెట్టూ నన్ను పొద్దున్నే పలకరిస్తుంది. ఊళ్లో ప్రతి మనిషీ పలకరిస్తాడు. ఇవన్నీ వదిలి ఆ సిటీల్లో జానెడు బెత్తెడు కొంపల్లో నన్ను ఇరికించి - ఆస్పత్రులమ్మట తిప్పి - సూదులతో పొడిపించి - ఎందుకర్రా నన్ను చంపుతారు? ఎనభై ఏళ్లు దాటాయి. ఎలాగూ చావక ఉట్టికట్టుకు ఊరేగుతానా? హాయిగా నా ఇంట్లోనే, వాకిట్లోనే తృప్తిగా ఊపిరి విడుస్తాను. నన్ను బలవంతపెట్టకండి'' అంది ఆవిడ.

ఇక చేసేది లేక మందులు, పళ్లు కొనుక్కోమని కొంత డబ్బు తల్లికి ఇచ్చి వచ్చాడు క్రితంసారి వెళ్లినప్పుడు పురుషోత్తం.

ఇప్పుడీ టెలిగ్రాం చూడగానే అవసాన దశే అని గ్రహించి ఎందుకైనా మంచిదని స్నేహితుడి దగ్గర రెండు వేలు అప్పు చేసి తీసుకెళ్లాడు పురుషోత్తం భార్యతో కలిసి.

*** *** ***

తల్లి దిన వారాలు పూర్తి చేసుకుని వచ్చి పురుషోత్తం ఎకౌంటు బుక్ తీసి చూసుకున్నాడు. ఆదాయం తక్కువ, వ్యయం ఎక్కువ కనబడింది.

ఉగాది నాడు - ''పట్టుచీర కొనుక్కున్నావా పార్వతీ?'' అంటూ అడిగిన పక్కింటి పిన్ని గారికి.

''లేదు పిన్ని గారూ! ఈ సంవత్సరం మా అత్తగారు పోయారు కదా! మేం పండుగ చేసుకోకూడదని కొనుక్కోలేదు. లేకపోతే కొనుక్కునేదాన్నే!'' అంటూ జవాబిచ్చింది పార్వతి. భార్యకేసి చూసి ముసిముసిగా నవ్వాడు పురుషోత్తం.

టివిలో తన రాశికి చెప్తూన్న సంవత్సర ఫలాలు వినపడుతున్నాయి. ''ఈ రాశి వారికి ఆదాయం రెండు, వ్యయం పన్నెండు'' అని.

''బాబూ! బాగా చెప్పావు. నువ్వు చెప్పకపోయినా మాకు తెలుసులే!'' అనుకున్నాడు తనలో తాను పురుషోత్తం.

ఆదా చేసి ఉగాదికి భార్యకి పట్టుచీర కొనాలని ప్రారంభించిన పొదుపు ఉద్యమం కాస్తా పోయి - అప్పులతో ఆరంభమైంది పురుషోత్తానికి ఉగాది.

★